సంఘ విద్రోహులపై కఠిన చర్యలు

- డీఎస్పీ రాజశేఖర్‌రాజు

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, జూన్ 11: సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే సంఘ విద్రోహులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, తాగినా క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా పెట్టాలని, వారి కదలికలను గమనిస్తూ ఉండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ప్రవర్తన పట్ల అధ్యాపకులు దృష్టిసారించాలన్నారు. విద్యార్థులులెవరైనా చెడు వ్యసనాలకు బానిస అయినట్లు గుర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి విక్రయం, రవాణాపైన సమాచారం అందించిన వారి వివరాలు గుప్తంగా ఉంచుతామన్నారు. పట్టణంలో కొంతమంది రౌడీషీటర్లు గంజాయి తీసుకునే వారికి సహకరిస్తున్నట్లు సమాచారం ఉందని, రౌడీషీటర్లు మరో కేసులో ఇరుక్కుంటే వారిపైన కూడా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీషీట్ నమోదైన వారు పదేండ్ల పాటు ఎటువంటి కేసుల్లో ఉండకుండా ఉంటేనే దానిని ఎత్తివేస్తారని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. పట్టణంలోని దుకాణాల వారు వారి షాపులకు వచ్చే వాహనదారులకు సంబంధించిన పార్కింగ్ సదుపాయాన్ని వారే కల్పించాలని, రోడ్డుపై వాహనం నిలిపితే దుకాణ దారులపై కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం గుట్కాలను నిషేధించిందని, పట్టణంలో, గ్రామాల్లో గుట్కాలను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. సీఐలు వీరబాబు, సుధాకర్, నాగార్జున, ఎస్ఐలు పాల్గొన్నారు.

పెర్కకొండారం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రధానోపాధ్యాయుడు సైదులు, విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధులు

శాలిగౌరారం, జూన్ 11 : పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన మండలంలోని పెర్కకొండారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయిగణేశ్, ప్రవళ్లికకు వందేమాతరం ఫౌండేషన్ వారు ప్రతిభా పురస్కారాలు అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైదులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు పురస్కారాలు అందించినట్లు పేర్కొన్నారు.

మిర్యాలగూడ విద్యార్థినికి

మిర్యాలగూడ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇరాపురి అక్షర పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించగా వందేమాతరం ఫౌండేషన్ వారు ఆమెను ఘనంగా సత్కరించి అవార్డు అందించారు. ఎంఈఓ బాలాజీనాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

- ఎంఈఓ తరి రాము

ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న ఎంఈఓ తరి రాము

తిరుమలగిరి(సాగర్), జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ తరి రాము సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను అందజేసి మాట్లాడారు. బుధవారం పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ల చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు యూనిఫాంను అందించాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కొనమంచలి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాంతీయ వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా శోభారాణి

డాక్టర్ శోభారాణి

నకిరేకల్, జూన్ 11 : ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ డి. శోభారాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ పూర్ణచందర్ బదిలీపై వెళ్లడంతో నకిరేకల్ ప్రభుత్వాసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న శోభారాణిని అధికారులు నియమించారు.

చెంచుల హక్కుల పరిరక్షణకు కృషి

- ఆర్‌డీటీ టీమ్ లీడర్ రామ్మోహన్

చెంచులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

చందంపేట, జూన్11 : అడవినే నమ్ముకొని జీవనం సాగించే చెంచులను అటవీ శాఖ అధికారులు నిబంధనల పేరుతో ఇబ్బందులు పెట్టడం సరికాదని, వారి హక్కుల పరిరక్షణకు ఆర్‌డీటీ సంస్థ కృషి చేస్తుందని సంస్థ ఏరియా టీమ్ లీడర్ రామ్మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని పోలేపల్లి గ్రామ రైతు వేదికలో ఐటీడీఏ, బీఆర్ఎన్ఎఫ్, ఆర్‌డీటీ సంస్థల ఆధ్వర్యంలో చెంచులకు అటవీ హక్కులపై అవగాహన కల్పించారు. జిల్లాలోని 11 గూడాల్లో 650 చెంచు కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. చెంచులు జీవనోపాధి కోసం గ్రామంలోని వనరులను ఏ విధంగా ఉపయోగించుకోవాలి, వ్యక్తిగత అటవీ హక్కులను ఏవిధంగా కాపాడుకోవాలనే విషయమై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఆర్‌డీటీ శ్రీనివాసులు, నర్సింహులు, సీఈఓ వెంకటేశ్, జీఓ అహ్మద్, కమిటీ సభ్యులు చిర్ర శ్రీనివాస్, లింగయ్య, పెద్దయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ARMY LIQUAR CARD పోయినది
నందిపాటి సోములు (Rtd ARMY) S/o.సైదులు ఆలగడప 7/06/24 నాడు మిర్యాలగూడ రైతు బజారులో (Army Liquar Card) పోయినది Card No.(LB05111554191700X01) గల కార్డు పోయినది. దొరికినవారు సంప్ర||9505065669.
NLG-

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638

ఎక్కడి పనులు అక్కడే..!

- ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి కాని మరమ్మతు పనులు
- అపరిశుభ్రంగా దర్శనమిస్తున్న తరగతి గదులు
- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- ఆందోళనలో తల్లిదండ్రులు

నల్లగొండ పట్టణం మాల్‌బౌలిలోని ప్రభుత్వ పాఠశాల దుస్థితి

రామగిరి, జూన్ 11: వేసవి సెలవుల తర్వాత బుధవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. అయితే జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు నేటికీ అపరిశుభ్రంగానే దర్శనమిస్తున్నాయి. కనీసం పాఠశాలలు తెరిచి శుభ్రం చేయించాలనే ధ్యాస కూడా లేక పోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మాల్‌బౌలి, రహమాన్‌బాగ్ ఉర్దూ మీడియం స్కూల్, రామగిరి బాలుర ఉన్నత పాఠశాలలను నమస్తే తెలంగాణ మంగళవారం సందర్శించగా అపరిశుభ్రంగా కనిపించాయి. పాఠశాల నిండా రాళ్లు, ఇటుకలు, ఇసుక కుప్పలే దర్శనమిచ్చాయి.

బడిబాట కొనసాగుతున్నా..

ఈ నెల 6 నుంచి బాడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ ప్రారంభించింది. ప్రతి రోజు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉదయం 7 గంటలకే పాఠశాలకు వెళ్లి 11 గంటల వరకు బడిబాట నిర్వహించాలి. అయితే ఆయా పాఠశాలలను పరిశీలిస్తే ఇప్పటి వరకు కనీసం తెరిచినట్లు కూడా కనిపించడం లేదు. తరగతి గదులు, పాఠశాల పరిసరాలు దుమ్ము, చెత్తతో నిండి ఉన్నాయి. తరగతి గదులను శుభ్రం చేయలేదు. మరి బుధవారం పిల్లలు వస్తే ఎక్కడ కూర్చొబెడతారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పునఃప్రారంభం నాటికి ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేసి, అందంగా ముస్తాబు చేసి విద్యార్థులకు స్వాగతం పలకాల్సి ఉన్నా.. అందుకు విరుద్ధంగా దర్శనమిస్తున్నాయి. మరో వైపు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు కూడా పూర్తి కాలేదు.

మాల్‌బౌలి ప్రభుత్వ పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్న తరగతి గది

రహమాన్‌బాగ్ ఉర్దూమీడియం పాఠశాలలో పూర్తికాని టాయ్‌లెట్లు

రామగిరి ప్రభుత్వ పాఠశాల గేటు వద్దే ఇసుక, రాతి కుప్పలు

అసిఫ్ నెహర్ కాల్వ పనుల పరిశీలన

తక్కెళ్లపహాడ్ వద్ద అసిఫ్ నెహర్ కాల్వ పనులను పరిశీలిస్తున్న ఏఈలు రాములు, అమర్‌కుమార్

శాలిగౌరారం, జూన్ 11 : మండలంలోని ఐదు గ్రామాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన అసిఫ్ నెహర్ కాల్వ పనులను నీటిపారుదల శాఖ ఏఈలు రాములు, అమర్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. తక్కెళ్లపహాడ్, బైరవునిబండ గ్రామాల మధ్య జరుగుతున్న పనులను వారు స్థానిక నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, వల్లాల మాజీ సర్పంచ్ ఇంతియాజ్, నరిగె నర్సింహ, ఆంజనేయులు ఉన్నారు.

ఎంఆర్‌పీకే విత్తనాలు విక్రయించాలి

- ఏడీఏ నాగమణి

విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ నాగమణి

మిర్యాలగూడ, జూన్ 11: రైతులకు విత్తనాలను ఎంఆర్‌పీకే విక్రయించాలని విత్తన డీలర్లను ఏడీఏ నాగమణి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నాణ్యత లేని విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన ధరలు, స్టాక్ వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలని సూచించారు. ఆమె వెంట ఏఓ గుర్రం సరిత ఉన్నారు.

జోరుగా ఏరువాక

తిరుమలగిరి(సాగర్), జూన్ 11: మండలంలో వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వానకాలం సాగు పనులు జోరందుకున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు దుక్కులు దున్ని పత్తి విత్తనాలు విత్తుతున్నారు. మండలంలో గతేడాది సుమారు 20వేల ఎకరాల్లో పత్తిసాగు చేశారు. అయితే వర్షాలు సరిగా కురువక దిగుబడి ఆశించిన మేర రాలేదు. ఈ సంవత్సరం వర్షాలు బాగానే కురుస్తాయనే వాతావరణశాఖ సూచనలతో చాలా మంది రైతులు తిరిగి పత్తి సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం పత్తిసాగు పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

గాత్‌తండాలో పత్తి విత్తనాలు విత్తుతున్న రైతు, కూలీలు

మినీ గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

నీలగిరి, జూన్ 11: గిరిజన బాలికల మినీ గురుకులాల్లో ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ ప్రాంతీయ సమన్వయాధికారి కె.లక్ష్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రిపురారం గురుకులంలో 1వ తరగతిలో 30, 3వ తరగతిలో 4, 5లో 3, పెద్దవూరలో 1వ తరగతిలో 30, 2లో 5, 3లో 2, 4లో 3, చందంపేటలో 1వ తరగతిలో 30, 4లో 01, 5వ తరగతిలో 18 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వీటి కోసం సంబంధిత మండలాలకు చెందిన గిరిజన బాలికలు అర్హులని, ఆసక్తి గల వారు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుతోపాటు ఆధార్, రేషన్ కార్డ్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, కులం, ఆదాయ ధ్రువపత్రాలు జత చేయాలని సూచించారు. ఈ నెల 21న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

15 నుంచి దర్వేశిపురం ఆలయ బ్రహ్మోత్సవాలు

నల్లగొండ సిటీ, జూన్ 11 : కనగల్ మండలం దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ అలుగుబెల్లి నరసింహారెడ్డి, ఈఓ జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 15న సుప్రభాతసేవ, విఘ్నేశ్వరపూజ, ఎదుర్కోళ్లు, 16న అమ్మవారి కల్యాణం, 17న శతఘటాభిషేకం, బోనాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

నకిరేకల్, జూన్ 11 : బడిబాట కార్యక్రమంలో భాగంగా నకిరేకల్ పట్టణంలోని ఎంపీపీఎస్ (బాలికల), జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు గురువారం ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం అందించనున్నట్లు ఎంఈఓ ఎం.నాగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు జరిగే కార్యక్రమానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఎస్‌జీటీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ : డీఈఓ

రామగిరి, జూన్ 11: జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ, సమాంతర క్యాడర్‌లో పనిచేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పదోన్నతుల కౌన్సిలింగ్ కోసం బుధవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని డీఈఓ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ పుస్తకంతో ఉదయం 10 గంటలకు డీఈఓ ఆఫీసుకు రావాలని సూచించారు. అర్హత ఉన్న టీచర్లు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు.

వైద్య ధ్రువీకరణకు ప్రిఫరెన్షియల్ కేటగిరి ఉపాధ్యాయులు రావాలి

ఉపాధ్యాయులు ప్రిఫరెన్షియల్ కేటగిరి కింద కొత్తగా ఎంటైటిల్మెంట్ పాయింట్స్ పొందేందుకు వైద్య ధ్రువీకరణ పత్రం కోసం తమ మెడికల్ రిపోర్ట్స్‌తో బుధవారం హాజరుకావాలని డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో సూచించారు.రెండు రోజులు జిల్లా మెడికల్ బోర్డు నల్లగొండలో వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, ఆ తర్వాత వచ్చిన వారికి అనుమతి ఉండదని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

చందంపేట, జూన్ 11 : మండలంలోని ముర్పునూతల గ్రామానికి చెందిన బహుజన సీనియర్ నాయకుడు ఎలిజాల బాలరాజు ఇటీవల మృతి చెందాడు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య డివిజన్ నాయకులు మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50,500 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు పులికంటి భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య, నాయకులు వస్కుల సత్యనారాయణ, రావులపల్లి బాలరాజు, నల్ల నర్సింహ పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపైనే బురద

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


పీఏపల్లి చౌరస్తాలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 11: మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గాంధీ బజారు, తాసీల్దార్ కార్యాలయం ఎదుట, దుగ్యాల రహదారి వరకు గుంతల మయంగా మారింది. దాంతో వర్షపు నీరు పూర్తిగా రోడ్డుపైనే నిలుస్తుండడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రోడ్డుపై నడిచే పరిస్థితి లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బీఎల్ఆర్

మహిళకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, జూన్ 11: మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం, పట్టణంతోపాటు అడవిదేవులపల్లి మండలానికి చెందిన 41 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించి మాట్లాడారు. ప్రభుత్వం మహిళల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్లు హరిబాబు, సురేశ్‌కుమార్, ఆర్ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, నాయకులు పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, గంధం రామకృష్ణ, మంద సైదులు, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో మంగళవారం జరిగిన లింగమంతుల స్వామి, సౌడమ్మతల్లి ఆలయ ఉత్సవాల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే బాలూనాయక్

ఎమ్మెల్యే బాలూనాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చందంపేట(దేవరకొండ), జూన్ 11 : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మూతపడిన పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించారని తెలిపారు. ప్రతి పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. సమావేశంలో ఎంఈఓలు సామ్యానాయక్, మాతృనాయక్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతిలేని ప్రైవేటు పాఠశాలను రద్దు చేయాలి

- విద్యార్థి సంఘాల ఆందోళన

కొండమల్లేపల్లిలో ప్రైవేటు పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కొండమల్లేపల్లి, జూన్ 11: కొండమల్లేపల్లి పట్టణంలోని సంత సమీపంలో పాత వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ పాఠశాలను మూసి వేయించాలని కోరుతూ మంగళవారం పలువురు విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి తీసుకోకుండానే పాఠశాల నిర్వహిస్తున్న యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాల నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వల్లమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్, డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేశ్, ఏబీవీపీ జిల్లా నాయకులు కొత్త అఖిల్, అకాశ్, వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు సిరాజ్‌ఖాన్, విద్యార్థి రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్ బాబురామ్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాట్రావత్ రాజునాయక్ పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

ట్రాలీ ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న ప్రయాణికులు

కొండమల్లేపల్లి, జూన్ 11 : కొండమల్లేపల్లి మండంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడువక పోవడంతో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కొండమల్లేపల్లి నుంచి అజ్మాపురం, చింతకుంట్ల, చెన్నారం, చింతచెట్టుతండా, గాజీనగర్, రామునిగుండ్లతండా, పెండ్లిపాకలతో పాటు ఇతర గ్రామాలకు ఆటోల్లోనే ప్రయాణించాల్సి పరిస్థితి నెలకొంది. దీనిని ఆసరాగా తీసుకొని ఆటోల వారు తమ సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని మరీ వెళ్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఒక్కో ఆటోలో 15 నుంచి 25 మందిని ఎక్కించుకొని ప్రమాదకరంగా వెళ్తున్నారు. ప్రయాణికులు కూడా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో చేసేది లేక ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీసులు ఈ విషయమై దృష్టి సారించక పోవడంతో ఈ తంతు కొనసాగుతున్నది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పొలం గట్ల మీద కొబ్బరి మొక్కలు నాటాలి : ఎంపీడీఓ

అడవిదేవులపల్లి, జూన్ 11: రైతులు తమ పొలం గట్ల మీద కొబ్బరి మొక్కలను నాటాలని ఎంపీడీఓ కరుణాకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. మన ప్రాంతాల్లో కొబ్బరి పంట పండకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కొబ్బరి బోండాలను దిగుమతి చేసుకుంటున్నారని, దాంతో ధర అధికంగా ఉంటున్నదని పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కొబ్బరి చెట్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. రైతులు ప్రతి ఎకరానికి 40 కొబ్బరి మొక్కలను పొలం గట్ల మీద నాటేందుకు అవకాశం కల్పిస్తున్నదని, అందుకు గుంత తీయడానికి, మొక్కలు కొనేందుకు, సంరక్షణకు అయ్యే ఖర్చును ప్రభుత్వం రైతులకు అందించనున్నదని పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు గ్రామ పంచాయతీ కార్యదర్శులను. ఎఫ్ఏలను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ సౌకర్యాలను వినియోగించుకోవాలి

గాంధీనగర్‌లో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.ధర్మానాయక్ కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని గాంధీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు కుర్ర కృష్ణకాంత్, జనార్దన్‌రెడ్డి, తావూరియా పాల్గొన్నారు.